# కొత్త ఊపిరి అందుకుంది

ఉవ్వెత్తుగా ఎగిరివచ్చే కొత్త ఊపిర్లను అందుకోవడం ఒక్క గోదావరి తల్లికే చేతనవును గాబోలు!

బరంపురం గాలి విసిరింది.

చటున గోదావరి అందుకుంది.

విజయనగరంనుంచి వీచింది గాలి.

గౌతమీ హస్తాలు కౌగలించాయి!

తీగ తీస్తే డొంక కదులుతుంది.

ఆదిని పశ్చిమ చాళుక్య వాహిని ముంచెత్తితే ఉరకల్ని పరుగుల్ని ఒక పక్కకు నెట్టి మేలిమిని చేపట్టి తొలి తెలుగు కవితను దోసిళ్ళతో అందించింది.

గుండ్లకమ్మనుంచి వచ్చిన ఘుమఘుమారభటిని లాలించి పాలించి కవితా శ్రీతో నాథవంతం చేసింది—నా గడ్డను గోదావరి.

ఒక్కమాటలో చెప్పాలంటే నా తల్లి నిజంగా పాత కొత్తల కొత్తపాతల మేలికలయిక.

"చిత్రాంగి మేడ" ముందు భాగంలో ఏమిటా సభ ఏమి కోలాహలం! పెదవుల చప్పుడు లేని నవ్వు దొంతరలు! గుండెలనిండా పైకి వినపడని మౌన సంగీతం.

నడవడం యెరగని పరుగులు—

మాటలు మానిన పాటలు—

సాహితీ సమితి చప్పబడింది, చింతచచ్చినా పులుపు చావలేదు. చేప కూడగట్టి నన్నే చూడమన్నట్టు నిలబడింది. అది ఓం ప్రథమంగా బరంపురంలో ప్రాణవాయువును చేదుకుంది. కొత్తపాత్రలో పాత

పానీయం! సాహితీ సమితి సరుకుతో. అభినవాంధ్ర కవి పండిత సభ అవతరించింది. పంచాగ్నుల, చిలుకూరి మున్నగు హేమాహేమీలు నిలబడి కొమ్ము కాచారు. గురుభాగవతుల ధర్మారావు సహస్రాక్షుడై సభా విజయానికి తోడ్పడ్డారు. శివశంకరాదులు సరేసరి.

పేపర్లో రిపోర్టు చదివితే ప్రాణం లేచివచ్చింది మాకు. ఇప్పుడు షష్టిపూర్తికి పైబడిన వారంతా అప్పటికి "పాపం పసివాళ్ళు."

ఆ అభినవాంధ్ర కవి పండిత సభ రెండవ సమావేశం అదిగో అక్కడ జరుగుతోంది.

ఉస్మానియావిశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసరు శ్రీ రాయప్రోలు అధ్యక్షులు. రాయప్రోలు ఒంటికీ, పంటికీ ఇంకా బింకం తగ్గలేదు. శివశంకరుల హుషారు. వేదుల కొంటెతనం, కృష్ణశాస్త్రి నిగనిగ మాయని రోజులు.

రాయప్రోలు అధ్యక్షోపన్యాసం శారద రామాయణం పాడినట్టుంది. కాని రాయప్రోలు గురుస్థానం చెక్కు చెదరకుండా ఉండడంవల్ల అది వేద పారాయణంలా చెల్లింది.

వేదుల వంతు తర్వాత, వేదుల కొంటెతనం అంతా మూతిలో బిగించి–"వచనాన్నే పాట పాడే ఈ సభలో పద్యం ఎలా చదవాలో తెలియడంలేదు. కాని–ఏముంది? తెలియడానికి తిరగేస్తే సరిపోతుంది" అంటూ కొత్తగా రాసుగొచ్చిన 'కాంక్ష', 'ఆషాఢ మేఘం' చదివాడు. అచ్చంగా సంస్కృతం చదువుకున్నవాడు కూర్పు కొత్తదనంలో ఎంత మెరగగలడో ఆ పద్యాలు చెప్పాయి.

తర్వాత నావంతు 'భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు' అన్నట్టు భయపడుతూ 'గురజాడ వాల్మీకి' అన్న వ్యాసం చదివాను. అప్పుడే భావ కవిత్వ 'మతం' పుచ్చుకున్నట్టు జయకట్టారు. వీడు మావాడు అన్నట్టు శివశంకరుల చేతి పూవు. ఎందరో పద్యాలు చదివారు. మాటా డారు. అంతా గరం గరం. నవం నవం. అంతా ముందుకే-గమ్యంమాత్రం ఆ దేవుడికే తెలియాలి. ఆ సభలో ఇద్దరు స్త్రీలు పాల్గొనడం విశేషం. ఇంకో విశేషం ఏమంటే భావ కవితా మదన మోహనుడు కృష్ణశాస్త్రి పెదవి విప్పకపోవడం. ఆయన ఉద్యోగపర్వంలో 'కృష్ణ-రాయబారం' నిషిద్ధం.

మధ్యాహ్నం కవి కొండలవారి కావ్యపఠనం. అసలే 'పీల మనిషి. తస్సా తెరగని సాత్త్వికుడు, 'నా మంచి పాట నాలో నేనే పాడుకుంటాను' అని మొదలెడితే 'పైకి పాడొద్ద'ని గోల. మాటవరసకంటే అక్షరాలే పట్టు కున్నారు. ఆయన పాడదలచుకున్నది పాడకుండా దిగలేదు. 'ఆడంబరం లేని గొప్ప కవిని ఆదరించడం చేతకానిది తెలుగు జాతి' అని రుజువు చేసుకున్నారు.

సభ ముగిసింది.

గౌతమీ లైబ్రరీలో 'గురజాడ జయంతి' అన్నారు. ఆశ్చర్యపడ్డాం.

విజయనగరంలో నేను చదువుకునే రోజుల్లో 'గురజాడ'ను ఎవరూ గొప్ప కవిగా చెప్పుకోలేదు, వట్టి కన్యాశుల్కం నాటక కర్త. అదైనా

నాటకంగా అంగీకరించినవారు కొద్దిమంది. అది ఒక 'ఫార్సు' అని చాలా మంది అభిప్రాయం. అంతవరకూ ఆయనకు వర్ధంతులుగాని, జయంతులు గాని విజయనగరంలో తలపెట్టినవారు లేరు.

ఆ గౌరవం గౌతమీ తీరానికి దక్కింది.

చింతా దీక్షితులుగారు అధ్యక్షులు. అసలే మితభాషి. మనిషి ఆరడుగులైతే మాటలు ఐదే, అన్నట్టు అయిదు పేజీల అధ్యక్షోపన్యాసం. కాగితాలమీద పరచిన ఆ ముత్యాల్లో ఒక పొల్లులేదు.

గురజాడను "గురుజాడ"గా ఆరాధించేవారు మొదట దీక్షితులుగారు. తర్వాత భమిడిపాటివారూను.

గురజాడ కవితలో జానపద రీతిని అనుసరించి ఇదీ తెలుగు జీవం అని పరిశ్కృతంగా పాటలు వ్రాశారు దీక్షితులు. ఆయన హాస్యపు ఒడుపును పట్టుగొమ్మగా చేసుకున్న భమిడిపాటివారు గురజాడను తలపెట్టని గడియ ఉండేదికాదు.

ఆ రోజు ప్రధాన వక్త శ్రీపాద కామేశ్వరరావుగారు. మూడు గంటలు పరవశంగా కన్యాశుల్కం గురించి మాటాడితే ఆ మూడు గంటలూ మాటల్లో అమోఘమైన నాటకం చూశాం. మధురవాణిని తనివి తీరా చూద్దామని మేమనుకుంటే - కరటకుడూ అగ్నిహోత్రుడూ మా వెంట పడ్డారు. తుదిని శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథతో సభలో పువ్వులు చల్లినట్లయింది. సభలో ఉంచిన 'గురజాడ బొమ్మ' మీసాల చాటునుంచి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

●